సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



శత శాతం ఓటింగే లక్ష్యం

ఓటు మన హక్కు అని. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ జె.మయూర్ అశోక్ సూచించారు. 8లో



మహిళా డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా 8లో



దేశ ప్రగతిలో మహిళల పాత్ర కీలకం 8లో

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్



పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న జిల్లా పరిశీలకుడు విజయభాస్కర్

మురళీనగర్: జిల్లాలో శనివారం నిర్వహించిన పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్-2024) ప్రశాంతంగా జరిగింది. నగరంలోని విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ పరిధిలో 19 కేంద్రాలు, భీమిలి మహిళా పాలిటెక్నిక్ పరిధిలో 6, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ పరిధిలో 3, మొత్తం 28 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు 13,021 మంది విద్యార్థులను కేటాయించగా 12,147 మంది హాజరయ్యారు. వీరిలో బాలురు 7,268 మంది, బాలికలు 4,879 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 874 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. పాలిసెట్ జిల్లా పరిశీలకుడు, సాంకేతిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ (అకడమిక్) కె.వి జయభాస్కర్ నగరంలోని పాలిసెట్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణ రావు, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ కేడీవీ నరసింహారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు ఓటరు చైతన్య ర్యాలీ



టీ షర్ట్స్, బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మహారాణిపేట: స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటలకు ఆర్కే బీచ్‌లో సుమారు ఐదు వేల మందిని భాగస్వాములను చేస్తూ 5కే రన్ ఫర్ ఓట్ పేరుతో ఓటరు చైతన్య ర్యాలీని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఆర్.కె. బీచ్‌లోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి పామ్ బీచ్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ చాంబర్‌లో శనివారం యువ ఓటర్లకు ప్రోత్సాహకంగా టీ షర్ట్స్, బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు, స్వీప్ సిబ్బంది, బీఎల్‌వోలు, యువ ఓటర్లు, అన్ని శాఖల సిబ్బందితో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

ఎస్ఎస్‌టీ బృందాల పనితీరు పరిశీలన



పరిశీలిస్తున్న విశాఖ ఎంపీ వ్యయ పరిశీలకుడు రెంగరాజన్

మహారాణిపేట : ఎస్ఎస్‌టీ (స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్) బృందాల పనితీరును విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు రెంగరాజన్ పరిశీలించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం పర్యటించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. సాధారణ పౌరుల పట్ల గౌరవప్రదంగా ఉండాలని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆయన వెంట సమన్వయకర్త, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సీహెచ్ గణపతి, ఇతర అధికారులు ఉన్నారు.

30న జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం, ఒకటి నుంచి ఏడు వరకు స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం.పోలినాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి ఒకటి నుంచి ఏడో స్థాయీ సంఘాల సమావేశాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సర్వసభ్య సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశాలకు సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

నేటి ఏపీ సెట్‌కు ఏర్పాట్లు

ఏయూక్యాంపస్ : రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష (ఏపీ సెట్)కు జిల్లాలో ఏర్పాట్లు చేసినట్లు మెంబర్ సెక్రటరీ ఆచార్య జి.ఎం.జె.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 20 కేంద్రాల్లో ఆదివారం జరగనున్న ఈ పరీక్షకు జిల్లా నుంచి 9,311 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి 12.30 వరకు పరీక్ష జరుగుతుందని, పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి అనుమతిస్తారన్నారు.

చెప్పారంటే.. చేస్తారంటే..



- వైఎస్సార్ సీపీ–2024 మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం
- రంగుల హామీలకు స్వస్తి చెప్పి.. ప్రజల సంక్షేమానికి పెద్దపీట
- అన్ని రంగాలకూ సమ ప్రాధాన్యం

సాక్షి, విశాఖపట్నం : అందరికీ విద్య.. అందరికీ ఆరోగ్యం.. అందరికీ సంక్షేమం.. అందరికీ అభ్యున్నతి.. అన్నదాతకు భరోసా.. అన్ని రంగాలకూ సమ ప్రాధాన్యం.. చేసేదే చెప్పేలా.. చెప్పిందే చేసేలా రూపొందించినదే వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో అని జిల్లా ప్రజలు అభిప్రాయపడ్డారు. అలవి కాని హామీలు లేవు.. గాల్లో మేడలు కట్టిస్తామన్న మాటలు లేవు.. ఉన్నదంతా ఒక్కటే ప్రజా సంక్షేమం. సుపరిపాలనే ధ్యేయంగా 2019 నుంచి 2024 వరకు అమలు చేసిన నవరత్నాలకు మరింత మెరుగులు దిద్ది.. కొత్త వెర్షన్‌తో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను విడుదల చేశారు. ప్రతి పేదవాడికీ నేనున్నానే ఆసరా ఇచ్చేలా.. ప్రతి రైతుకీ వ్యవసాయానికి భరోసా కల్పించేలా.. ప్రతి అవ్వకీ.. ప్రతి తాతకి.. చేయూతనందించేలా.. బిడ్డ చదువు కోసం అమ్మకు తోడు నిలిచేలా.. మేనిఫెస్టోను రూపొందించారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 99 శాతం వరకు అమలు చేసింది. ఇప్పుడు చంద్రబాబులా మోసపూరిత హామీల జోలికి పోకుండా.. ప్రతి పథకం ప్రజల సంక్షేమం కోసమే అన్నట్లుగా రూపొందించింది. సామాజిక న్యాయాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపించేలా తీర్చిదిద్దింది. సంక్షేమం ఓ వైపు.. అభివృద్ధి మరో వైపు బేరీజు వేసుకునేలా 2019–24 కంటే మిన్నగా.. 2024–29లో సుపరిపాలనే ధ్యేయంగా అడుగులు వేస్తున్నట్లు సీఎం జగన్ స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ విడుదల చేసిన మేనిఫెస్టోపై అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 14 ఏళ్ల కాలంలో ఏనాడూ చంద్రబాబు మేనిఫెస్టోలో చెప్పింది.. చేసిన దాఖలాలులేవనీ.. కానీ సీఎం జగన్ మాత్రం ఈ ఐదేళ్ల కాలంలో మేనిఫెస్టోలో ఉన్న ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చారని కొనియాడుతున్నారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై విభిన్న వర్గాల స్పందన ఇదీ.

యువతలో నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో ఆచరణీయంగా ఉంది. ఆయన అమలు చేసిన నవరత్నాలతో ప్రజలకు చాలా మేలు జరిగింది. విశాఖ స్టార్టప్ హబ్, ప్రతీ జిల్లా కేంద్రంలో స్కిల్ కాలేజీ, ప్రతీ నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేస్తామని ఈ మేనిఫెస్టోలో పేర్కొన్నారు. నైపుణ్య శిక్షణ పొందే యువతకు ప్రతి నెలా పెయిడ్ ఇంటర్న్‌షిప్ రూ.3 వేలు ఇస్తామని ప్రకటించారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి ఇవన్నీ ఉపయోగపడతాయి.

– గరే జగదీశ్, మధురవాడ

సీఎం జగన్‌తోనే మహిళలకు గౌరవం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత సమాజంలో మహిళలకు గౌరవం రెట్టింపు అయింది. 2019 ఎన్నికల రోజు వరకు ఉన్న పొదుపు సంఘాల రుణాలను నాలుగు దఫాల్లో చెల్లించారు. సున్నావడ్డీ పథకం అమలు చేశారు. మహిళల పేరునే ఇంటి పట్టాలు ఇచ్చి సొంతింటి కలను నిజం చేశారు. ఈ మేనిఫెస్టోలో కూడా రూ.3లక్షల దాకా రుణాల మీద సున్నావడ్డీ కార్యక్రమం అమలు చేస్తామని చెప్పారు. ఆచరణకు సాధ్యమైన హామీలే ఇందులో ఉన్నాయి. సీఎం జగన్ చెబితే కచ్చితంగా నెరవేరుస్తారు.

– ఒమ్మి, అఖిల, వాంబేకాలనీ

సీఎం జగన్ అంటేనే నమ్మకం



సీఎం జగన్‌పై అన్ని వర్గాల ప్రజలకు నమ్మకం ఉంది. ఆయన మాటకు అంతటి విశ్వసనీయత ఉంది. ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రభుత్వ విద్యారంగం బలోపేతమైంది. 2025 నుంచి ఒకటో తరగతికి ఐబీ విధానం అమలు చేస్తామని పేర్కొన్నారు. నాలాంటి ఎంతో మంది ఆయన ప్రకటించిన మేనిఫెస్టోను విశ్వసిస్తున్నారు. నా మొదటి ఓటుతో ఆయన్ని, ఆయన ప్రకటించిన మేనిఫెస్టోను గెలిపిస్తాను.

– చేకూరి సౌమ్య, విద్యార్థిని, కళానగర్, మధురవాడ

ఆటోవాలాలకు మరింత లబ్ధి



23 ఏళ్లుగా ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. గత ప్రభుత్వాల హయాంలో ఆటోడ్రైవర్లకు ఏ విధమైన ప్రోత్సాహకాలు ఉండేవి కాదు. ముఖ్యమంత్రిగా జగన్ అధికారం చేపట్టిన తర్వాత వాహనమిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఐదేళ్లలో రూ.50 వేలు అందుకున్నాను. ఈ పథకాన్ని కొనసాగిస్తూ ఆటో, మ్యాక్సీ క్యాబ్, ట్యాక్సీ, టిప్పర్/లారీ డ్రైవర్లు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల బీమా, వాహనాలు కొనుగోలుకు వడ్డీ రాయితీ లబ్ధి చేకూర్చేలా మేనిఫెస్టో రూపొందించారు. ఈ ప్రభుత్వ హయాంలో వాహనమిత్రతో పాటు అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాలు అందాయి. సొంతింటి కల నెరవేరింది.

–లగిశెట్టి దేముడు బాబు, వంగలి, సబ్బవరం మండలం

ఆచరణ సాధ్యమైన మేనిఫెస్టో



ఆచరణ సాధ్యమైన లక్ష్యా**లతో రూపొం**దించిన **మేనిఫెస్టోగా** స్పష్టమవు**తోంది. ఈ ఐదేళ్లలో 99 శాతం హామీలను** ప్రభు**త్వం అమలు** చేయగా.. అతిశయోక్తులకు **పోకుండా 100** శాతం చేయగలిగిన అంశా**లతో ఈ మేనిఫెస్టో**ను రూపొందించారు.

– **ఆచార్య** జి.సుదర్శనరావు, విశ్రాంత **ఆచార్యుడు, కామర్స్** మేనేజ్‌మెంట్ విభాగం

ఎవరిని నమ్మాలో ప్రజలే నిర్ణయించుకోవాలి



మేనిఫెస్టో అంటే చెప్పింది చేయాలి.. చేయగలిగిందే చెప్పాలి. గత ఎన్నికల సమయంలో జగన్ ప్రకటించిన మేనిఫెస్టోలో 99 శాతం అమలు చేశారు. ఇప్పుడు నవరత్నాలు కొనసాగిస్తూ పింఛన్ కానుక, అమ్మ ఒడి, రైతుభరోసా, డ్వాక్రా సున్నావడ్డీ రుణమాఫీ పరిధి పెంచారు. దీని వల్ల పేద, మధ్య తరగతి వర్గాలకు ఉపయోగకరంగా ఉంటుంది. మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, న్యాయ కళాశాల, జల ప్రాజెక్టులు రానున్న ఐదేళ్లలో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. శుభపరిణామం. ఎవరిని నమ్మాలి అన్నది ప్రజలు నిర్ణయించుకోవాలి.

– ఆచార్య వి.బాలమోహన్‌దాస్, విశ్రాంత ఉపకులపతి

అమ్మ ఒడి పెంపుతో మరింత మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు అమలు చేసిన అమ్మ ఒడి వల్ల మా పిల్లలకు ఎంతో మేలు జరిగింది. ఇప్పుడిస్తున్న మొత్తానికి అదనంగా మరో రెండు వేలు పెంచుతున్నట్లు ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. సీఎం జగన్ చెబితే కచ్చితంగా అమలు చేస్తారు. విద్యారంగంలో పెనుమార్పులు ఆయన వల్లే సాధ్యమయ్యాయి. మంచి చదువు అందించేందుకు ఆయన తీసుకుంటున్న చర్యలు భేష్.

– ఆర్.దేవి, గృహిణి, భీమిలి

ఇది కాదా ఉల్లంఘన?

- గీతంలో వికసిత్ భారత్ అంబాసిడర్– క్యాంపస్ డైలాగ్ సదస్సు
- 29న నిర్వహించేందుకు టీడీపీ ఎంపీ అభ్యర్థి ఏర్పాట్లు
- ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్న శ్రీభరత్



క్యాంపస్ డైలాగ్ ఇన్విటేషన్

సాక్షి, విశాఖపట్నం : ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చేందుకు అడ్వర్స్ డేని ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహిస్తుంటే విష ప్రచారం చేసిన టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్.. ఇప్పుడు తన విద్యాసంస్థలో స్వయంగా తానే ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. వికసిత్ భారత్ అంబాసిడర్– క్యాంపస్ డైలాగ్ పేరుతో ఈ నెల 29న సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఒక ఎంపీ అభ్యర్థిగా ఉంటూ తన విద్యా సంస్థలో విద్యార్థుల్ని ప్రభావితం చేసేందుకు ఈ సదస్సుని ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు ఆహ్వానం పలికారు. ఎన్నికల సమయంలో సదస్సు పేరుతో తనకు ఓటెయ్యాలని ప్రలోభాలకు గురిచేసేందుకు శ్రీభరత్ ఈ తరహా వ్యవహారాలకు దారితీస్తున్నారు. ఇప్పటికే గీతం స్టాఫ్ ఆధ్వర్యంలో ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా సదస్సుకు హాజరవ్వాలనీ ఫోన్ చేసి ప్రభావితం చేస్తున్నారు. ఈ సదస్సుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హాజరవుతున్నారు. బీజేపీతో కలిసి వెళ్తున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారం కోసమే క్యాంపస్ డైలాగ్ పేరుతో భరత్ ఈ సదస్సు నిర్వహిస్తున్నారనీ.. దీన్ని తక్షణమే నిలిపేయాలని రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఏయూలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చే సదస్సుకు రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేకపోయినా.. గీతం అధినేత, టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్.. పచ్చపత్రికల్లో వార్తలు రాయించి.. అనుమతి ఇచ్చిన అధికారులతోనే రద్దు చేయించేలా చేశారు. ఇప్పుడు మాత్రం పూర్తి రాజకీయ ప్రయోజనాల కోసం సదస్సును ఎలా నిర్వహిస్తారనీ.. అధికారులు చర్యలు తీసుకోరా అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

ప్రొటోకాల్ దర్శనాలు లేవు

- చందనోత్సవం రోజు సామాన్య భక్తులకు ప్రాధాన్యం
- కలెక్టర్ మల్లికార్జున

సింహాచలం: మే 10న సింహగిరిపై జరిగే వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేయనున్నట్టు కలెక్టర్ మల్లికార్జున చెప్పారు. ఆ రోజు ఉదయం గంట మాత్రమే ఆచారం ప్రకారం దేవస్థానం ధర్మకర్తలు, దాతలు, జ్యుడీషియల్ వారికి అంతరాలయ దర్శన స్లాట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సింహగిరిపై శనివారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తితో కలిసి చందనోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జున వివరాలు వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో చందనోత్సవం రోజు ప్రొటోకాల్ దర్శనాలు రద్దు చేశామన్నారు. గతేడాది ట్రాఫిక్ సంబంధించి వచ్చిన లోటు పాట్లపై సమీక్షించిన మీదట కొండదిగువ పార్కింగ్ పాయింట్లు పెంచనున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టడానికి ఈ సారి 40 పెద్ద బస్సులతో పాటు మరో 40 మినీ బస్సులు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

పకడ్బందీగా పాస్‌లు, టికెట్ల జారీ

ఉద్యోగుల వెహికల్ పాస్‌లు లిమిటెడ్‌గా జారీ చేయడంతో పాటు దర్శన టికెట్లు పకడ్బందీగా రూపొందించనున్నట్టు తెలిపారు. టికెట్ రెండు దశల్లో చెక్ చేశాలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

భక్తులకు సౌకర్యాలు

క్యూలో ఉండే భక్తులు ఇబ్బంది పడకుండా 154 ప్రదేశాల్లో మంచినీరు అందించే ఏర్పాట్లు చేయనున్నట్టు వెల్లడించారు. అలాగే సేవా సంస్థలు, దేవస్థానం సహకారంతో పలు ప్రదేశాల్లో మజ్జిగ అందిస్తామన్నారు. గతేడాది ఎగ్జిట్ మార్గం నుంచి కూడా పలువురు వచ్చారని ఫిర్యాదులు రావడంతో ఆ ప్రాంతాల్లో ఒక ఐపీఎస్ అధికారి, రెవెన్యూ అధికారిని, దేవస్థానం అధికారిని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దేవస్థానం ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థల వారికి రూ. 300 టికెట్ పెట్టి వారిని మధ్యాహ్నం 3 నుంచి 4గంటల లోపు రూ.1500 దర్శనం క్యూల్లో పంపించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 4 నుంచి 5గంటలకు విభిన్న ప్రతిభావంతులకు దర్శనం కల్పిస్తామన్నారు.

15 కిలో మీటర్ల మేర క్యూ లైన్లు

ఉచితదర్శనం క్యూతో పాటు రూ.300, రూ.1000, రూ.1500 టికెట్లు ఉంటాయన్నారు. మొత్తం 15కిలోమీటర్ల మేర క్యూలైన్లలో బారికేడింగ్, షామియనాలు వేయడంతో పాటు ప్రతీ చోటా సీసీ కెమెరాలు, పోలీస్ , దేవదాయశాఖ సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

టికెట్ల కుదింపు

గతసారి రూ.1000, రూ.1500 టికెట్లు పదివేల వరకు ఇచ్చామని, ఈ సారి 7వేలు మాత్రమే జారీ చేస్తామన్నారు. ఈసారి చందనోత్సవంకి లక్ష మందికిపైగా భక్తులు వస్తారని అంచనాతో ఏర్పాట్లు చేయనున్నట్టు చెప్పారు. మే 2 నుంచి 7వ తేదీలోగా టికెట్ల విక్రయాలు ముగిసేలా నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఆన్‌లైన్‌తో పాటు కొన్ని బ్యాంకులు, దేవస్థానంలో టికెట్లు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీ సత్తిబాబు, నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులుపాల్గొన్నారు.

చందనోత్సవంరోజు అష్టోత్తరంపూజ

చందనోత్సవంరోజు పరోక్షంగా భక్తుల గోత్రనామాలతో అష్టోత్తరంపూజ నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. భక్తులు రూ. 1116 టికెట్ ఆన్‌లైన్‌లో తీసుకోవచ్చునని తెలిపారు. తొలి టికెట్ కలెక్టర్ మల్లికార్జున తీసుకుని అష్టోత్తరంపూజ టికెట్ల విక్రయాలు ప్రారంభించారు. పరోక్షంగా అష్టోత్తరం పూజ చేయించుకునే వారికి చందనం, ప్రసాదం పోస్టులో పంపించడం జరుగుతుందన్నారు. www.aptemples.ap.gov.inలో టిక్కెట్లు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు.



సింహగిరిపై చందనోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

బీహెచ్ సిరీస్‌పై కొరడా!

- రాష్ట్రంలో ఈ సిరీస్ రిజిస్ట్రేషన్లు నిషేధం
- ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉంటున్నట్టు తప్పుడు పత్రాలు
- వాటితో వాహనాలకు అనధికార రిజిస్ట్రేషన్లు
- ఇలాంటి వాటిని సీజ్ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

సాక్షి, విశాఖపట్నం : వాహనాలు దేశంలో ఎక్కడైనా తిరిగేందుకు వీలుగా భారత ప్రభుత్వం కొన్నాళ్ల క్రితం బీహెచ్ సిరీస్‌ను ప్రవేశపెట్టింది. ఆయా రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న వారు తమ వాహనాలకు నిర్ణీత పన్నులు చెల్లించి ఈ బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్లు చేయించుకునే వీలుంటుంది. ఈ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న వాహనాలు ఏ రాష్ట్రంలోనైనా తిరిగేందుకు అనుమతి ఉంటుంది. అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లో బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్లకు అనుమతించడం లేదు. దీనివల్ల తమ రాష్ట్ర ఆదాయానికి గండి పడుతుందన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాయి. కానీ కొంతమంది బ్రోకర్లు, డీలర్లు తప్పుడు మార్గాల్లో వాహనాలకు బీహెచ్ సిరీస్‌లో అనధికారికంగా రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. ఈ రాష్ట్రంలో నివాసం ఉంటూ ఇతర రాష్ట్రాల్లో ఉంటున్నట్టు తప్పుడు సర్టిఫికెట్లను సృష్టించి వాటితో ఈ సిరీస్‌లో రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నట్టు రవాణా శాఖ అధికారులు ఇటీవల గుర్తించారు. దీనివల్ల సంబంధిత రాష్ట్రానికి పన్నులు చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఈ నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు బీహెచ్ సిరీస్ ఉన్న వాహనాలను వీరు తనిఖీ చేస్తున్నారు. ఇలా విశాఖలో ఉంటూ ఇతర రాష్ట్రాల్లో బీహెచ్ సిరీస్‌లో తమ వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయించిన త్రిస్టార్ డీలర్ గుర్తింపును రద్దు చేశారు. ఈ డీలర్ విశాఖలో ఉంటున్న వాహనదారునికి అరుణాచల్‌ప్రదేశ్‌లో నివాసం ఉంటున్నట్టు నివాస ధృవీకరణ సృష్టించి మోసానికి పాల్పడ్డారు. దీంతో సంబంధిత వాహనాన్ని (కారును) సీజ్ చేశారు. ఈ కారుకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ జారీ చేసినందుకు ఆ డీలరు గుర్తింపును రద్దు చేశారు. అలాగే విశాఖపట్నంలో నివాసం ఉంటూ అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ వంటి ఇతర రాష్ట్రాల నకిలీ చిరునామా ప్రూఫ్‌తో బీహెచ్ సిరీస్‌లో రిజిస్ట్రేషన్లు పొందిన వాహనాలను సీజ్ చేయనున్నారు. అంతే కాదు. సంబంధిత వాహన తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసిన డీలర్లు, వాహన యజమానులపై ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించినందుకు చర్యలు తీసుకుంటామని విశాఖ రవాణా శాఖ ఉప కమిషనర్ జీసీ రాజారత్నం తెలిపారు.

ఆ వాహనానికి లైఫ్ ట్యాక్స్ కూడా వసూలు చేస్తామన్నారు. ఇలా ఇప్పటివరకు విశాఖలో తప్పుడు నివాస సర్టిఫికెట్లతో ఇతర రాష్ట్రాల్లో బీహెచ్ సిరీస్‌తో రిజిస్ట్రేషన్లు చేయించుకున్న మూడు కార్లను సీజ్ చేశామని చెప్పారు. ఇలాంటి వాహనాల గుర్తింపు కోసం డ్రైవ్‌ను కొనసాగిస్తామని తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో ఏయూ ఉద్యోగులు



వంశీకృష్ణ ప్రచారంలో పాల్గొన్న ఏయూ హాస్టల్ ఉద్యోగి శ్రీనివాసరావు, ఏయూ సహకార సంఘం ఉద్యోగి దువ్వి మంగరాజు

దాబాగార్డెన్స్: నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారంలో ఏయూ ఉద్యోగులు పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. జనసేన దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఏయూ హాస్టల్ ఉద్యోగి జె.శ్రీనివాసరావు, ఏయూ సహకార సంఘం ఉద్యోగి దువ్వి మంగరాజు పాల్గొన్నారు. ప్రభుత్వ సంస్థలో పని చేస్తూ ఓ రాజకీయ పార్టీకి మద్దతుగా వీరిద్దరూ ప్రచారం చేయడంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడానికి పలువురు సిద్ధమయ్యారు. ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెప్పపాటులో విషాదం

- వెదుళ్లపాలెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- టైరు పేలి కంటైనర్ లారీని ఢీకొన్న కారు
- ముగ్గురు దుర్మరణం, ఒకరికి గాయాలు
- మృతులు విశాఖ నగరవాసులు



ప్రమాదానికి గురైన కారు, దాంట్లో చిక్కుకున్న మృతదేహాలు



మృతురాలు వెంకటలక్ష్మి(ఫైల్)



మృతుడు దాడి గగన్(ఫైల్)



మృతుడు మధుకర్ (ఫైల్)

నక్కపల్లి : వారు ప్రయాణిస్తున్న కారు యమదూతలా మారింది.. టైరు రూపంలో యమపాశం విసిరింది.. జాతీయ రహదారిపై వెదుళ్లపాలెం వద్ద జరిగిన ఘోర ప్రమాదం రెప్పపాటులో ముగ్గురి ప్రాణాలు హరించింది. రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. వివరాలివి. జీవీఎంసీ 91వ వార్డు గవరవీధి, ఎన్ఏడీ జంక్షన్, కూర్మనపాలెం ప్రాంతాలకు చెందిన నలుగురు కారులో శనివారం ఉదయం కాకినాడ బయలు దేరారు. శరగడం వెంకటలక్ష్మి (37) తన కొడుకు వికాస్, మేనమామ కొడుకు దాడి గగన్ (15)లతో కలిసి వ్యక్తిగత పని మీద కారులో ప్రయాణమయ్యారు. వీరితో పాటు వికాస్ స్నేహితుడైన సుంకర మధుకర్(27) బయలుదేరాడు. పాయకరావుపేటలో వెంకటలక్ష్మి తల్లిని చూసి అక్కడ నుంచి కాకినాడ వెళ్లాలనుకున్నారు. కారు వెదుళ్లపాలెం జంక్షన్ వద్దకు చేరుకునే సరికి హఠాత్తుగా టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతల రూట్లోకి దూసుకుపోయింది. తుని నుంచి విశాఖ వైపు వెళ్తున్న కంటైనర్ లారీని ఢీకొట్టడంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జయింది. ఈ ఘటనలో కారులో ఉన్న వెంకటలక్ష్మి, దాడి గగన్, సుంకర మధుకర్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ప్రమాద తీవ్రతకు కారు టాప్ పైకి లేచిపోయింది. డోర్లు ఊడిపోయాయి. ప్రమాదంలో వికాస్ ప్రాణాలతో బయటపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతన్ని నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రెండు నెలల్లో జర్మనీ వెళ్లాల్సి ఉండగా....

వికాస్ స్నేహితుడైన మధుకర్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మెకానికల్ విభాగంలో అప్రెంటీస్ చేస్తున్నట్టు తెలిసింది. తుని ప్రాంతానికి చెందిన అతడు ఎన్ఏడీ జంక్షన్‌లో ఉంటున్నాడు. అతడు రెండు నెలల్లో ఉన్నత చదువు, ఉద్యోగం కోసం జర్మనీ వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నాడు. ఇంతలోనే మృత్యువు రోడ్డు ప్రమాద రూపంలో కబళించి అనంత లోకాలకు తీసుకెళ్లిపోయింది. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు హుటాహుటిన నక్కపల్లి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు దుర్మరణం పాలవడంతో విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని రోదించారు. కారులో చిక్కుకున్న మృతదేహాలను స్థానికుల సాయంతో పోలీసులు బయటకు తీసి పోస్టు మార్టం కోసం నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

గవరవీధిలో విషాదఛాయలు

గోపాలపట్నం: వెదుళ్లపాలెం జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో శరగడం వెంకటలక్ష్మి మృతి చెందగా ఆమె కుమారుడు వికాస్ గాయాలపాలవడంతో గవరవీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. గవరవీధిలో ఉంటున్న శరగడం నర్సింగరావు సప్లయర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో అతడి భార్య వెంకటలక్ష్మి మృతి చెందగా కుమారుడు వికాస్ గాయాలపాలయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు, స్థానికులు పెద్ద ఎత్తున ఇంటికి తరలివచ్చి కన్నీరుమున్నీరయ్యారు. వెంకటలక్ష్మి ఎప్పుడు నవ్వుతూ నవ్విస్తూ అందరితో కలివిడిగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదంలో మృతి చెందిన దాడి గగన్‌ది కూర్మన్నపాలెం కాగా.. శనివారం ఉదయం టోల్‌గేట్ వద్ద కారు ఎక్కాడు.

క్లుప్తంగా

సహస్ర ఘటాభిషేకానికి శ్రీవైష్ణవులకు ఆహ్వానం

దరఖాస్తు గడువు వచ్చే నెల 5

సింహాచలం: సింహగిరిపై వచ్చే నెల 10న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం సందర్భంగా ఆరోజు రాత్రి నిర్వహించే సహస్ర ఘటాభిషేకంలో పాల్గొనేందుకు శ్రీవైష్ణవుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సింహాచలం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి శనివారం తెలిపారు. పంచ సంస్కారపరులైన, పూర్తి వైదికపరమైన ఆహార్యంతో ఉన్న పరంపరాగత దాక్షిణాత్య శ్రీవైష్ణవ సంప్రదాయానికి చెందిన వారు మాత్రమే సహస్ర ఘటాభిషేకంలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన శ్రీవైష్ణవులు వచ్చే నెల 5వ తేదీలోపు దర ఖాస్తు చేసుకోవాలని, ముందుగా వచ్చిన 300 మంది దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని తెలియజేశారు. వాట్సాప్ నంబర్ 93905 01082 ద్వారా లేదా endow-eosvlnsd@gov.in కు దరఖాస్తులు మెయిల్ చేయాలన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 2023–24 విద్యాసంవత్సరంలో అనేక కార్యక్రమాలు నిర్వహించి నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడంతో 2024–25 నుంచి 2033–34 వరకు స్వయం ప్రతిపత్తి హోదా పొందిందని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజుల తెలిపారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ కళాశాల ప్రిన్సిపాల్ మంజులకు పత్రాలు అందించి, అభినందించారు. మంజుల మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తి హోదా వల్ల కళాశాలలో విద్యార్థినులకు గుణాత్మకమైన విద్య అందించి మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డి.అరుణపద్మ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా రక్షణ చర్యలు

సీతంపేట: ఎండ తీవ్రత దృష్ట్యా కార్మికులు వడగాల్పులకు గురి కాకుండా భవన నిర్మాణ సంస్థలు, దుకాణాలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థల యజమానులు సరైన రక్షణ చర్యలు చేపట్టాలని ఉప కార్మిక కమిషనర్ సునీత ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్, కలెక్టర్, ఉప కార్మిక కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న రోజుల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయట వేడి వాతావరణంలో పని చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో తాగు నీరు, ఓఆర్ఎస్, ఐవీ ఫ్లూయిడ్స్, ప్రథమ చికిత్స మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వేడిగాలులు తగలకుండా షెల్టర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వడ దెబ్బ తగిలినపుడు తక్షణ ప్రథమ చికిత్స ఎలా చేయాలనే అంశంపై కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రచార పర్వం

27వ వార్డు బీవీకే కాలేజీ చాకలి గెడ్డ ఏరియాలో దుస్తులు ఉతికి ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్, చిత్రంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు





సీతమ్మధారలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



ఎన్నికల ప్రచారంలో భాగంగా పారిశ్రామికవాడలో చిన్నారులతో వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

శత శాతం ఓటింగే లక్ష్యం



యోగాసనాలు వేస్తున్న నగరవాసులు

ఏయూ క్యాంపస్: ఓటు మన హక్కు అని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ జె.మయూర్ అశోక్ సూచించారు. శనివారం ఉదయం యోగా భారతి ట్రస్ట్, ఏయూ యోగా విలేజ్, పతంజలి యోగా కేంద్రం సంయుక్తంగా బీచ్ రోడ్డులోని ఎంజీఎం పార్కులో నిర్వహించిన మై ఓట్.. మై రైట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శతశాతం ఓటింగ్ నమోదు కావాలంటే పౌరులంతా ఓటు వేయాలని కోరారు. ఓటు ఆవశ్యకత, విలువను గుర్తించాలన్నారు. ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ 300 మందికిపైగా యోగా సాధకులు ఆసనాలు వేశారు. అనంతరం యోగా సాధకులను ఈ సందర్భంగా జేసీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో పైడం నాయుడు, ఆచార్య ఓఎస్ఆర్ భానుకుమార్, ఆచార్య కె.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సాలాపువానిపాలెంలో యువకుడి హత్య

- ప్రియుడితో కలిసి కోడలే హతమార్చిందని మృతుని తండ్రి ఫిర్యాదు
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- మృతుని భార్య పాత్రపై దర్యాప్తు



మృతుడు శ్రీనివాసరావు



భార్య భాగ్యలక్ష్మి, పిల్లలతో శ్రీనివాసరావు

సబ్బవరం : సాలాపువానిపాలెంలో ఓ యువకుడు శుక్రవారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. అయితే ప్రియుడిపై మోజులో మరో ఇద్దరితో కలిసి కోడలే కడతేర్చిందని మృతుని కుటుంబ సభ్యులు పోలీసులకు చేసిన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ఘటన మండలంలోని గోటివాడ శివారు సాలాపువానిపాలెం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. సీఐ పిన్నింటి రమణ శనివారం సాయంత్రం వెల్లడించిన వివరాల ప్రకారం... సాలాపు శ్రీనివాసరావు (32) దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆరేళ్ల క్రితం దువ్వాడ సమీపంలోని మంగళపాలెంకు చెందిన భాగ్యలక్ష్మితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. ఈ నేపథ్యంలో భాగ్యలక్ష్మికి అదే గ్రామానికి చెందిన గళ్ల రవి (26)తో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరగడంతోపాటు పెద్దలు వద్ద పంచాయతీ నిర్వహించడం... అనంతరం కలిసి జీవించడం జరిగేది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో సాలాపు శ్రీనివాసరావు పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి ఇంటికి వస్తుండగా... అదే గ్రామానికి చెందిన గళ్ల రవి (26), గరికిపాటి శ్రీహరి (22) కలిసి శ్రీనివాసరావును అడ్డుకుని మంచం కోడితో తలపై దాడి చేశారు. దీంతో పెద్దగా కేకలు వేయడంతో శ్రీనివాసరావు తండ్రి అప్పారావుతోపాటు గ్రామస్తులు ఘటనాస్థలికి చేరుకుని చూడగా... శ్రీనివాసరావు తీవ్ర గాయాలతో పడి వున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు సబ్బవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్ల వైద్యులు నిర్ధారించారు. కోడలు భాగ్యలక్ష్మితోపాటు మరో ఇద్దరు వ్యక్తులు కలిసి తమ కుమారుడు శ్రీనివాసరావును హత్య చేశారని మృతుని తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. శ్రీనివాసరావు తలపై మంచం కోడితో దాడి చేసిన తర్వాత... సుమారు 150 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. హత్యకు పాల్పడిన గళ్ల రవి (26), గరికిపాటి శ్రీహరిని(22) అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భార్య భాగ్యలక్ష్మిపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమణ తెలిపారు.

'గంటా'వి దిగజారుడు రాజకీయాలు

మంగమారిపేట గ్రామ కుల పెద్ద వాసుపల్లి పెద్ద అమ్మోరు



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో వాసుపల్లి అమ్మోరు, పార్టీ నాయకులు

కొమ్మాది: ఓటమి భయంతో గంటా శ్రీనివాసరావు దిగజారుడు రాజకీయాలకు తెర లేపారని జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట గ్రామ కుల పెద్ద వాసుపల్లి పెద అమ్మోరు అన్నారు. శనివారం ఉదయం గంటా అనుచరులు తనను బలవంతంగా విశాఖపట్నం తీసుకెళ్లి, మభ్యపెట్టి టీడీపీ కండువా కప్పి, ఫొటోలు తీసి, టీడీపీలో చేరినట్లు ప్రచారం చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగమారిపేటలో గతంలో ఎమ్మెల్యేగా ఉన్న గంటా శ్రీనివాసరావు చేసిన మోసం, కష్టాలు, కోర్టు కేసులు ఇంకా మర్చిపోలేదన్నారు. గంటా వల్ల తమ ప్రాంత వాసులు ఇప్పటికీ మానసిక క్షోభ అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ భీమిలి క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కలిసి జరిగిన విషయాన్ని వివరించారు. తను పార్టీ మారలేదని, గంటా అండ్ బ్యాచ్ చేసిన కుట్ర అని పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించి గంటా శ్రీనివాస్‌కు తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి బోర రామకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పోతిన శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో మహిళల పాత్ర కీలకం

హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి

సబ్బవరం: నేటి మహిళలు వ్యక్తిగత సాధికారత కంటే దేశ సర్వతో ముఖాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నారని హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం సాంకేతికత,వ్యాపారం,ప్రజా జీవితంలో యువతుల పాత్ర అనే అంశంపై భారత మహిళా కమిషన్, డీఎస్ఎన్ఎల్‌యూ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. మహిళలు తమ హక్కుల కోసం పోరాటం చేసిన సందర్భాలు గతంలో అనేకం ఉన్నాయని.. నేడు ఆ పరిస్థితులు లేవన్నారు. వంట గది నుంచి వాషింగ్‌టన్ వరకు టీచర్ నుంచి సాఫ్ట్ వేర్ ఉద్యోగం వరకూ మహిళలు లేని రంగం లేదని చెప్పారు.విద్యార్థులు తమ లక్ష్య సాధనలో అంకిత భావంతో కృషి చేస్తే భవిష్యత్తులో రాణిస్తారన్నారు.విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ మహిళల ప్రాత నేటి సమాజంలో ఎంతో ముఖ్యమైనది అన్నారు.బ్రిటీష్ కాలం నుంచి నేటిరకూ అనేక సందర్భాల్లో మహిళలు పోషించిన పాత్రను వివరించారు. జాతీయ మహిళా కమిషన్ జాయింట్ సెక్రటరీ అశోలి చలాయి మాట్లాడుతూ భారత ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న సామాజిక,ఆర్థిక భద్రత కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్,శ్రీకాకుళం అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రతినిధి సుజాత,గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (ఫైనాన్స్) నుంచి లవణ్ కుమార్,ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్,రిజిస్ట్రార్ నందిని,ఉమెన్,చైల్డ్ సెంటర్ కన్వీనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే ముస్లింలకు న్యాయం

- బాబు హయాంలో నిర్లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎ.రెహమాన్



సమావేశంలో మాట్లాడుతున్న రెహమాన్

డాబాగార్డెన్స్: చంద్రబాబు నాయుడు హయాంలో ముస్లింలు అన్ని విధాల వివక్ష, నిర్లక్ష్యానికి గురయ్యారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఏ రెహమాన్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ముస్లింలకు అన్ని విధాల న్యాయం జరిగిందని, అందుకు ముస్లింలంతా వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు సీఏఎస్, ఎన్ఆర్సీ విషయంలో ముస్లింలకు అన్యాయం జరిగినా పట్టించుకోలేదన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో అమలు చేశారని చెప్పారు. టీడీపీ, బీజేపీ వంటి పార్టీలు ముస్లింలకు ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లు మతపరమైన రిజర్వేషన్‌గా ఆరోపించడంతో ఆయా పార్టీలకు ముస్లింల పట్ల ఉన్న చిత్తశుద్ధి తెలుస్తోందన్నారు.

అక్కసుతోనే వలంటీర్లపై ఫిర్యాదు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 58 నెలల నుంచి వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే వెళ్లి ప్రతి నెలా మొదటి తేదీనే వలంటీర్లు పింఛన్ అందివ్వడం జరిగిందన్నారు. ఇది దేశంలోనే రికార్డ్ అని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలు తీరు జీర్ణించుకోలేని టీడీపీ పెట్టుబడిదారీ, దోపిడీ వర్గాలు ఎన్నికల కోడ్ పేరుతో వలంటీర్లతో పింఛన్ల పంపిణీ ఆపించారని ఆరోపించారు. పింఛన్‌దారుల్లో టీడీపీపై వ్యతిరేకత రావడంతో ఇప్పుడు చంద్రబాబు కవరింగ్ ఇస్తున్నా ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, బాబ్జి పాల్గొన్నారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి